

పాడి రైతుల సంక్షేమానికి..

రూ.36.48 లక్షల విశాఖ డెయిరీ నిధులతో చీడికాడ మండలంలో నిర్మించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. 8లో



రాష్ట్రాభివృద్ధికి అవిరళ కృషి

కశింకోట మండలంలో రూ.కోటితో నిర్మించిన అభివృద్ధి పనులను పిల్లా రమాకుమారి, గుడివాడ హిమగౌరి ప్రారంభించారు. 8లో

ఉత్సవ బ్రోచర్ ఆవిష్కరణ



విశాఖ: నీలమ్మ వేప చెట్టు అమ్మవారి వార్షిక ఉత్సవాల బ్రోచర్‌ను శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా యార్లగడ్డ



ఏయూక్యాంపస్: విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షునిగా రాజ్యసభ పూర్వ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నియమితులయ్యారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఆదివారం ఉదయం ఏయూ హిందీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఐక్యరాజ్య సమితిలో హిందీని అధికార భాషగా చేయడం లక్ష్యంగా తాను పనిచేస్తానన్నారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ వినియోగం, ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతిని హిందీ భాష ద్వారా వ్యాప్తి చేయడానికి ఈ సంస్థ పనిచేస్తుందన్నారు.

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు అవార్డులు

అనకాపల్లి: న్యాయ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ కాన్ఫరెన్స్‌లో అవార్డులు అందజేశారు. జిల్లా న్యాయస్థానంతోపాటు మేజిస్ట్రేట్ స్థాయి నుంచి ముగ్గురికి చొప్పున అవార్డులు దక్కాయి. శనివారం గుంటూరు మెడికల్ కాలేజీలో జరిగిన కాన్ఫరెన్స్‌లో విశాఖ ఉమ్మడి జిల్లా స్థాయి కోర్టు నుంచి అనకాపల్లికి చెందిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వద్దాది వెంకటరావుకు అత్యుత్తమ కమాండెంట్ సర్టిఫికెట్‌ను ఏపీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె. సుదర్శన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు అడిషనల్ అడ్వకేట్ జ్యూడిషియల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్ ప్రదానం చేశారు. ఏపీపీ వెంకటరావుకు ఈ అవార్డు దక్కడంతో పోలీసు ఉన్నతాధికారులు, బార్ అసోసియేషన్ కార్యదర్శి సురా శ్రీనివాస్, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

మోదకొండమ్మను దర్శించుకున్న వైవీ సుబ్బారెడ్డి



మోదమాంబ సన్నిధిలో సుబ్బారెడ్డి, అమర్

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, రీజనల్ డిప్యూటీ కోఆర్డినేటర్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం రాత్రి ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో గల మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అరకు, పాడేరులో జరిగిన సిద్ధం సభలు ముగిసిన తర్వాత పాడేరు నుంచి విశాఖ వెళుతూ ఘాట్‌రోడ్డు జంక్షన్‌కు చేరుకున్నారు. వారికి ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, స్థానిక మోదమాంబ వర్తక సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వీరిద్దరినీ వర్తక సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిని కాపాడిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్

డాబాగార్డెన్స్: ఆర్.కె.బీచ్, రుషికొండ బీచ్‌ల్లో ముగ్గురిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్స్ రక్షించి ప్రాణాలు కాపాడారు. విశాఖ బర్మాకాలనీకి చెందిన 60 ఏళ్ల నక్కా లక్ష్మమ్మ అనారోగ్యం కారణంగా మనస్తాపంతో ఆర్.కె.బీచ్‌లో దిగి శనివారం ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ ఆమెను రక్షించారు. రుషికొండ బీచ్‌లో శనివారం సముద్రంలో చిక్కుకున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ జె.హరీష్, ఎం.నవీన్, టి.పోలిరాజు, ఓ.రాజు, జి.చిన్న, అప్పన్న, కె.రాజు రక్షించి ప్రాణాలు కాపాడారు. ముగ్గురి ప్రాణాలు కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఈ సందర్భంగా అభినందించారు.

ఏర్పాట్లు పరిశీలన



సూచనలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

మహారాణిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఏర్పాట్లను ఆదివారం సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఏపీ ప్రభుత్వ సలహాదారుడు(స్కిల్ ట్రైనింగ్) గాది శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. రుషికొండలోని రాడిసన్ బ్లూ రిసార్ట్, పీఎంపాలెంలోని వి.కన్వెన్షన్ వద్ద ఏర్పాట్లను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ, సీఈవో డాక్టర్ వి.వినోద్ కుమార్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి, ఈడీ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

రోజులు మారాయి

చేతిలో చిల్లిగవ్వ లేని రోజుల నుంచి నేడు కుటుంబాలను పోషించుకునే స్థాయికి ఎంతో మంది పేద మహిళలు చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇస్తున్న 'చేయూత'తో చిరు వ్యాపారాలు చేసుకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారు. ఏటా ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ సొమ్ముతో పైసా అప్పు చేయకుండా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.



ఆమె పేరు సిరిపల్లి బంగారమ్మ, నక్కపల్లి మండలం పెదతీనర్ల గ్రామంలో ఉంటూ ఊరూరా తిరుగుతూ చేపలు అమ్ముకుంటుంది. భర్త కొన్నేళ్ల క్రితమే మరణించాడు. పూరిపాకలో కొడుకుతో కలిసి జీవించేది. ఊరూరా తిరిగి చేపలు అమ్మగా వచ్చే సొమ్ము అప్పు తీర్చడానికి సరిపోయేది కాదు. చాలా యాతన పడేది. వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున ఇప్పటికి మూడు విడతల్లో రూ.56 వేలు వచ్చాయి. వ్యాపారంతో పాటు ప్రభుత్వం కల్పించిన ఆన్‌లైన్ సౌకర్యంతో విక్రయాలు చేస్తోంది. నెలకు రూ.30 వేలు ఆదాయం వస్తోంది. కొడుక్కి బోటు కొన్నది. తద్వారా సముద్రంలో చేపల వేటకు వెళ్తున్నాడు. జగనన్న లేఅవుట్‌లో దాబా ఇల్లు కట్టుకున్నారు. జగన్ బాబు పుణ్యమాని తమ బతుకులు బాగుపడ్డాయని ఆనందంగా చెప్పింది.

- పేద కుటుంబాల్లో వెలుగు రేఖలు
- నాలుగో విడత 'వైఎస్సార్ చేయూత'కు ఏర్పాట్లు
- గడిచిన మూడు విడతల్లో మహిళల ఖాతాల్లో రూ. 582.85 కోట్ల జమ
- తాజాగా జిల్లాలో 1,26,721 మందికి రూ.237 కోట్ల సాయం అందే చాన్స్



స్వయం సహాయక సంఘాల మహిళలు

తుమ్మపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు జిల్లాలో లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయి. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా అమలు చేస్తున్న చేయూత పథకం ఎంతోమందికి స్వయం ఉపాధి చూపుతోంది. ఇప్పటి వరకు మూడు దఫాలుగా ఇచ్చిన చేయూత నగదుతో సొంతంగా వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించే స్థాయికి చేరుకున్నారు. వడ్డీలకు పైసా అప్పు చేయకుండా ప్రభుత్వం ఇచ్చే సొమ్మును పెట్టుబడిగా పెట్టి వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఎన్నడూ తమ కోసం ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదని మహిళలంతా ముక్తకంఠంతో చెబుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 24 మండలాల్లో 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఈ పథకం వర్తింపజేస్తున్నారు. త్వరలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల కానున్నాయి. 1,26,721 మంది మహిళలకు రూ.237 కోట్లు జమవుతాయని అంచనా.

అధికారుల తోడ్పాటు

వైఎస్సార్ చేయూత పథకం లబ్ధిదారులకు మద్దతుగా రిటైల్, వస్త్ర వ్యాపారం, అమూల్, హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్, ఐక్యూ లిమిటెడ్, ప్రాక్టర్–గాంబుల్, రిలయన్స్ రిటైల్, అజియో బిజినెస్ వంటి బహుళ జాతి కంపెనీలతో అధికార యంత్రాంగం భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. పశువుల పెంపకం, పాల సేకరణ, ఆరోగ్య సేవలు, కిరాణా షాపులు, బట్టల షాపుల ఏర్పాటు, పండ్లు, కూరగాయలు, జీవాల కొనుగోలు కోసం ఆర్థిక సహాయం చేయడం ద్వారా చిన్న, మధ్యతరహా వ్యాపారాలు నడుపుకోవడానికి జీవనోపాధి మార్గాలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

వైఎస్సార్ చేయూత లబ్ధి ఇలా.. (రూ.కోట్లలో)

నియోజకవర్గం	1వ విడత	2వ విడత	3వ విడత	4వ విడత
అనకాపల్లి	24.47	26.86	31.52	34.83
చోడవరం	32.20	32.31	38.62	41.74
మాడుగుల	31.59	30.43	35.66	39.07
నర్సీపట్నం	31.19	30.60	35.52	39.72
పాయకరావుపేట	25.34	25.27	29.78	32.69
పెందుర్తి	13.26	14.12	15.63	17.29
యలమంచిలి	24.64	24.77	29.07	31.01
మొత్తం	182.69	184.35	215.81	237.60

ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకం నాలుగో విడత పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ నెల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డీబీటీ పద్ధతిలో లబ్ధిదారులకు నగదు జమ చేస్తారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతలు కలిపి రూ.582 కోట్లు జమ చేశాం. ఈ ఏడాది దాదాపు 1.26 లక్ష మంది మహిళలను అర్హులుగా గుర్తించాం. వారికి అతి త్వరలో నగదు జమ చేస్తాం. మహిళలకు భరోసాగా వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా వ్యాపార, జీవనోపాధులకు ప్రోత్సహిస్తున్నాం. మహిళలకు చేయూత రావడంతో ఆర్థిక భరోసా కలుగుతోంది.

– కె.శచీదేవి, డీఆర్డీఏ పీడీ

సీఎం వైఎస్ జగన్ పర్యటన ఖరారు

రేపు విశాఖకు రాక



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న విశాఖ నగరానికి రానున్నారు. ఈ మేరకు పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. సీఎం జగన్ గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నం.3 వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులతో ఐదు నిమిషాల పాటు ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు చేరుకుంటారు. గంటన్నర పాటు 'విజన్ విశాఖ' పేరిట వాణిజ్య, వ్యాపారవేత్తలతో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి 12.35 గంటలకు బయలుదేరి పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్ హాల్‌కు చేరుకుంటారు. అక్కడ 'భవిత స్కిల్' డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొంటారు. 1.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి మధురవాడ ఐటీ హిల్ నెం.3 దగ్గర హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 2.30 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

నేడు జీవీఎంసీలో 'జగనన్నకు చెబుదాం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. సమస్యలపై నగర ప్రజలు నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చునని మేయర్ హరి వెంకట కుమారి, కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

రికార్డు స్థాయిలో పల్స్ పోలియో



తారువలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



అనకాపల్లి గొల్లవీధి యూపీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో హేమంత్

జిల్లాలో 95.36 శాతం నమోదు

సాక్షి, అనకాపల్లి: చిన్నారుల ఆరోగ్యవంతమైన జీవనానికి పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం జిల్లాలో రికార్డు స్థాయిలో జరిగింది. ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు ఏఎన్‌ఎంలు, ఆశాలు, వలంటీర్లు చిన్నారులకు చుక్కల మందు వేశారు. జిల్లాలో 24 మండలాల పరిధిలో అన్ని సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు కలిపి మొత్తం 1409 బూత్‌ల్లో పోలియో చుక్కలు వేశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ శాంతి ప్రభ, డీఐవో డాక్టర్ జె.ప్రశాంతితోపాటు 12 మంది ప్రత్యేకాధికారులు, ఆరుగురు ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు. జిల్లాలో రికార్డు స్థాయిలో 95.36 శాతం (లక్షా 88 వేల 524) మందికి పోలియో చుక్కలు వేశారు.

పోలియో రహిత సమాజ నిర్మాణానికి కృషి

దేవరాపల్లి: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ చుక్కల మందు వేసి పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేవరాపల్లి మండలం తారువలో ఆదివారం ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి దూరంగా ఉండే వారిపైన, ఇటుక బట్టీలు, సంచార జాతులు, ఇతన నిర్మాణ పనులు చేపట్టే వారిపై ప్రత్యేక దృష్టి సారించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని శత శాతం విజయవంతం చేయాలని సూచించారు.

విద్యార్థులకు వలంటీర్ ప్రోత్సాహం

ప్రతిభ చూపిన వారికి షీల్డుల ప్రదానం



విద్యార్థులకు షీల్డులు అందజేస్తున్న ఉమ్మలాడ వలంటీర్ లక్ష్మీ ప్రసన్న

మునగపాక: ఉమ్మలాడ గ్రామ వలంటీర్ సూరిశెట్టి లక్ష్మీ ప్రసన్న తన ఔదార్యాన్ని చాటుకున్నారు. గ్రామంలో పది, ఇంటర్ విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఆదివారం ఆమె షీల్డులు ప్రదానం చేశారు. ఇక్కడ సచివాలయంలో పని చేస్తున్న ఆమె తనకు వచ్చే గౌరవ వేతనాన్ని సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. ఈ సందర్భంగా వలంటీర్ మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. విద్యాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ, ఉప సర్పంచ్ మందా రాము, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సూరిశెట్టి రామకృష్ణ, పెద్దలు సూరిశెట్టి శ్రీనివాసరావు, కరోతి విజయకుమార్, మొల్లేటి వెంకట చిన్నారావు, కాండ్రేగుల రామప్పారావు పాల్గొన్నారు.

పన్ను చెల్లిస్తే వడ్డీ రాయితీ

- ఆస్తి పన్నుపై రాష్ట్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్
- ఈనెల 31లోగా పన్ను చెల్లిస్తే వడ్డీ పూర్తిగా మాఫీ
- ప్రభుత్వ నిర్ణయంతో వేలాది మందికి ఊరట



యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ వద్ద పన్ను చెల్లిస్తున్న యజమాని



యలమంచిలి పట్టణంలో కిరాణా వ్యాపారికి వడ్డీ రాయితీ గురించి వివరిస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను బకాయిలు ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. జిల్లాలో యలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను బకాయిలు పడిన వారికి 100 శాతం వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలక సంఘాల్లో వేలాది మంది ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో బకాయిలపై వడ్డీ భారీగా పెరిగిపోతోంది. పదేళ్లపాటు ఆస్తి పన్ను చెల్లించకపోతే వడ్డీతో కలిపి రెండింతలు అవుతుంది. అసలు, వడ్డీ చెల్లింపులు భవన యజమానులకు భారంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పురపాలక శాఖ మరోసారి వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)ను తీసుకొచ్చింది. దీంతో పురపాలక సంఘాల్లో వేలాది మంది బకాయిదారులకు ప్రయోజనం కలగనుంది. గత ఆర్థిక సంవత్సరం ముగింపులోనూ వడ్డీమాఫీ ప్రకటించిన ప్రభుత్వం, వరుసగా రెండో ఏడాది ఈ ఆర్థిక సంవత్సరం 2023–24లోనూ బంపర్ ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు పన్ను మొత్తం ఒకేసారి చెల్లిస్తే పూర్తిగా వడ్డీ రాయితీ వర్తించనుండటంతో బకాయిదారులు ముందుకొస్తారని అధికారులు భావిస్తున్నారు.

ఈనెల 31 వరకు గడువు

పట్టణాల్లో ఆస్తి పన్ను బకాయిలకు వడ్డీ మాఫీ వర్తించాలంటే బకాయిలతో సహా మొత్తం ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. 2023 మార్చి నెలాఖరు వరకు ఉన్న బకాయిలపై 100 శాతం వడ్డీ మాఫీ చేయనున్నారు. ఈ నెల 31 లోగా మొత్తం పన్ను బకాయిలు చెల్లిస్తేనే వడ్డీ మాఫీ వర్తిస్తుంది. ఆస్తి పన్ను బకాయిల వసూలుకు యలమంచిలి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లు ఏర్పాటు చేశారు. ఇంటింటా పన్ను వసూళ్లు కూడా చేపడుతున్నారు. ఎక్కువ పన్ను బకాయిలున్న భవన యజమానుల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం ఇచ్చిన ఆఫర్‌ను వివరిస్తున్నారు. మరోవైపు వార్డు సచివాలయాల్లో, ఆన్‌లైన్‌లోనూ ఆస్తి పన్నులు చెల్లించే అవకాశం కల్పించారు.

చెల్లించిన వారికీ వడ్డీ మాఫీ

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు చెల్లించిన వారికి కూడా మేలు చేకూరేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఇప్పటికే ఆస్తి పన్నులు చెల్లించిన వారు ఎంత చెల్లించారో వడ్డీ లెక్కగట్టి వచ్చే ఏడాది ఆస్తి పన్నులో ఆ మొత్తాన్ని తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. వడ్డీ రాయితీ ప్రకటించడంతో ఈసారి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా బకాయిలను పూర్తిగా వసూలు చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. యలమంచిలి పురపాలకసంఘ పరిధిలో 9626 ప్రైవేటు భవనాలు, 64 ప్రభుత్వ భవనాలు, 762 ఖాళీ స్థలాలకు మొత్తం 10,452 అసెస్‌మెంట్లు ఉన్నాయి. పాత బకాయిలు, ఈ ఆర్థిక సంవత్సరం బకాయిలు కలిపి మొత్తం రూ.3.93 కోట్లకు పైగా వసూలు కావాల్సి ఉంది. దీనిలో ఇప్పటివరకు రూ.2.16 కోట్ల వరకు వసూలైంది. ఇంకా రూ.1.77 కోట్లకు పైగా వసూలు కావాల్సి ఉందని మున్సిపాలిటీ రెవెన్యూ అధికారి ఆర్.నీలిమ సాక్షికి చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ ద్వారా ప్రజలకు సుమారు రూ.30 లక్షల వరకు ఆర్థిక లబ్ధి చేకూరుతుందన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీ మాఫీ పై యలమంచిలి, నర్సీపట్నం పురపాలకసంఘాల్లో అధికారులు లెక్కలు వేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఆస్తిపన్ను బకాయిలు, వాటికి సంబంధించిన వడ్డీ నమోదై ఉంది. బకాయిదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తే దానంతటదే వడ్డీ మాఫీ తీసుకునేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. కాగా బకాయిదారులు ముందుకొచ్చేలా యంత్రాంగం విస్తృత ప్రచారం మొదలుపెట్టారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీని పురపాలక సంఘ ప్రజలంతా సద్వినియోగపర్చుకోవాలి. ఈ మేరకు ప్రభుత్వం జీవో ఎంఎస్ నెంబరు 35ను విడుదల చేసింది. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి. ఈ నెలాఖరులోగా భవన, ఖాళీ స్థలాల యజమానులంతా ఆస్తి పన్ను మొత్తం చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలి. ఆస్తి పన్ను బకాయిలు వంద శాతం వసూలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం.

–కె.ఎ.కొండలరావు, మున్సిపల్ కమిషనర్

ఏం పొత్తులో.. ఏంటో?

- అభ్యర్థుల ప్రకటన లేకపోవడంతో మధనపడుతున్న తెలుగు తమ్ముళ్లు
- తూర్పు, పశ్చిమ మినహా ఏ స్థానానికి అభ్యర్థులను డిసైడ్ చేయని టీడీపీ
- పొత్తుల కారణంగా నష్టపోతున్నామన్న ఆందోళనలో కార్యకర్తలు
- జనసేనకి కేటాయిస్తారేమోనన్న భయంలో శ్రేణులు
- కలిసి ప్రచారానికి వెళ్లేందుకు ఆసక్తి చూపని తెలుగుదేశం ద్వితీయశ్రేణి నేతలు



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్ సీపీ దూకుడుగా వ్యవహరిస్తుంటే.. టీడీపీ మాత్రం పొత్తు చిక్కుముడిని విప్పేందుకు నానా యాతన పడుతోంది. జిల్లాలో కేవలం రెండు నియోజకవర్గాలకు మాత్రమే అభ్యర్థులు ఖరారు చేయడంతో మిగిలిన ప్రాంతాల్లో తమకు సీటు వస్తుందా.. లేదా జనసేన ఖాతాలోకి చేరిపోతుందా అంటూ కలవర పడుతున్నారు. ఒకవేళ జనసేనకు తమ నియోజకవర్గంలో టికెట్ ఇస్తే.. కలిసి ప్రచారం చేసే ప్రసక్తే లేదని ద్వితీయ శ్రేణి క్యాడర్, కార్యకర్తలు ఇన్‌చార్జిలకు స్పష్టం చేస్తున్నారు.

ఈ నెలలోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాబోతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సమరానికి సిద్ధం అంటూ దూసుకుపోతోంది. అయా నియోజకవర్గాల సమన్వయకర్తలు గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా నిత్యం ప్రజల మధ్యే ఉంటూ.. వారితో మమేకమవుతున్నారు. ఇక టీడీపీ, జనసేన విషయానికొస్తే.. పొత్తులతో క్యాడర్ చిత్తవుతున్నారు. ఎవరికి సీటొస్తుందో.. ఎవరు ఎప్పుడు ఎక్కడ నుంచి పోటీ చేస్తారో తెలీని సంకట స్థితిలో ఉంది. విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మాత్రమే తొలి జాబితాలో అభ్యర్థులను ప్రకటించింది. దీంతో మిగిలిన నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఆందోళనలో ఉండటంతో దిగువ క్యాడర్ కూడా అయోమయానికి గురవుతోంది. ఉన్న వారికి సీటివ్వొద్దంటూ కొత్తవారు తెరపైకి రావడంతో.. ఎవరి వెనుక ఉండాలో తేల్చుకోలేక ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. గణబాబుకు పశ్చిమ సీటు కేటాయించినా.. అక్కడ ఉన్న వార్డుల్లో సింహభాగం నాయకులకు మింగుడు పడటం లేదు. దీంతో వారిని బుజ్జగించే పనిలో గణబాబు ఉన్నారే తప్ప.. ప్రజల గురించి ఆలోచించడం మానేశారు. అదేవిధంగా.. తూర్పు నుంచి వెలగపూడికి టికెట్ కేటాయించినా.. అక్కడ కూడా క్యాడర్‌లో నైరాశ్యం నెలకొంది. తన సొంత మద్యం సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు తప్ప తమని పట్టించుకోలేదన్న కోపంతో క్యాడర్ రగిలిపోతోంది. ఉత్తరంలో గంటా ఉండే అవకాశం లేకపోవడంతో ఎవరికి సీటు వస్తుందో తెలీక టీడీపీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పశ్చిమం, గాజువాక, పెందుర్తిలోనూ అదే పరిస్థితి దాపురించింది. బయటికి రాలేక.. నియోజకవర్గంలో తిరగలేక.. నాయకులు సైతం అందుబాటులో ఉండకపోవడంతో టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా మారింది.

జనసేనతోనా.. నో చాన్స్!

జనసేన క్యాడర్ కూడా అదే అయోమయానికి గురవుతున్నారు. ఇన్నాళ్లూ.. పవన్ కల్యాణ్ సీఎం.. సీఎం.. అంటూ అరిచిగోల చేసిన కార్యకర్తలు.. పొత్తు కల్యాణ్‌గా మారి 24 సీట్లకే పరిమితమవ్వడంతో నిస్తేజంలోకి వెళ్లిపోయారు. హడావిడిగా పార్టీలు మారుతూ జనసేన కండువా కప్పుకున్న వారు కూడా బురదలో కూరుకుపోయామన్న భావనలో ఇల్లు కదలడం లేదు. పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ ఇచ్చేస్తారేమోనన్న అనుమానాలు సైతం టీడీపీలో బలపడుతున్నాయి. ఒకవేళ.. జనసేనకు టికెట్ కేటాయిస్తే.. వారి వెంటనడిచి ప్రచారానికి వెళ్లే పరిస్థితే లేదని టీడీపీ ఇన్‌చార్జులతో తెగేసి చెబుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులైతే.. జనసేన ఇన్‌చార్జుల కంటే తమ వెంట నడిచే క్యాడరే ఎక్కువగా ఉంటుందంటున్నారు. అలాంటి వారికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే.. ఎలా ఊరుకుంటామంటూ అధిష్టానానికి అల్టిమేటం జారీ చేసినట్లు సమాచారం. పొరపాటున విశాఖలోని వివిధ నియోజకవర్గాల్లో జనసేనకు టికెట్ ఇస్తే మాత్రం.. పొత్తూ లేదు.. గిత్తూ లేదు.. పార్టీ లేదు.. అని బిచాణా సర్దేసేందుకు కూడా టీడీపీ నాయకులు 'సిద్ధం'అంటున్నారని తెలుస్తోంది.

క్లుప్తంగా

హత్యాయత్నానికి పాల్పడిన భర్త అరెస్ట్

మాకవరపాలెం: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తను అరెస్టు చేశామని నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్ తెలిపారు. రాచపల్లికి చెందిన రావాడ విజయపై ఆమె భర్త రమణ గత నెల 29 రాత్రి అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పంటించిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో భార్య విజయతోపాటు చిన్న కుమార్తె శ్రీకావ్య తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఆదివారం రాచపల్లి జంక్షన్ వద్ద రూరల్ సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు రమణను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించినట్టు తెలిపారు.

50 తులాల వెండి, 2తులాల బంగారం చోరీ

తుమ్మపాల : తాళం వేసిన ఇంట్లో 50 తులాల వెండి, రెండు తులాల బంగారం చోరీ జరిగినట్టు పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు అందింది. పట్టణ ఎస్ఐ మహమ్మద్ అలీ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు పంచాయతీ సాయి నగర్ కాలనీకి చెందిన నాగేశ్వరరావు కుటుంబసమేతంగా గత నెల 23వ తేదీన విశాఖపట్నం వెళ్లారు. ఈ నెల 2న రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్టు గుర్తించి ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బూరుగుపాలెంలో పూరిల్లు దగ్ధం


దగ్ధమవుతున్న పూరిల్లు

రావికమతం: తట్టబంద పంచాయతీ శివారు బూరుగుపాలెంలో పూరిల్లు ఆదివారం సాయంత్రం కాలిపోయింది. నమ్మి అప్పలనాయుడు తన కుటుంబంతో సహా గ్రామంలో వ్యవసాయ కూలి పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇల్లు కాలిపోయినట్టు సమాచారం అందడంతో పరుగున ఇంటికి వచ్చాడు. అప్పటికే గృహోపకరణాలు, ధాన్యం, దుస్తులు సర్వం అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో బాధిత కన్నీటి పర్యంతమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతోంది.

పాడి రైతులకు తులసీరావు ఎనలేని సేవలు

- డిప్యూటీ సీఎం బూడి నివాళులు
- డెయిరీ నిధులతో 12 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం


జైతవరం–జాగవరపు వారి కళ్లాలు గ్రావెల్ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ : నిరంతరం పాడి రైతుల కుటుంబాల సంక్షేమం కోసం పాటుపడిన దార్శనికుడు దివంగత విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కొనియాడారు. ఆదివారం మండలంలోని మంచాల, శిరిజాం, బి.సింగవరం, జైతవరం, అప్పలరాజుపురం గ్రామాల్లో విశాఖ డెయిరీ నిధులు రూ.36.48 లక్షలు వ్యయంతో పూర్తి చేసిన గ్రావెల్ రోడ్లు, వాటర్ ట్యాంకు, శైలేజ్ ప్లాంట్, కల్వర్టులను శిలాఫలకాలు ఆవిష్కరించి రైతుల చేతుల మీదుగా రిబ్బన్‌లు కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసీరావు మన మధ్య భౌతికంగా లేకపోయినా ఆయన పాడి రైతుల మేలు కోసం చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి పనులు నిరంతరం ఆయన్ను గుర్తు చేస్తుంటాయన్నారు.

జైతవరంలో అభివృద్ధి పనులు ప్రారంభం

జైతవరం గ్రామంలో రూ.9.28 లక్షలతో ఆరు గ్రావెల్ రోడ్లను శిలాఫలకాలు ఆవిష్కరించి రైతులతో రిబ్బన్ కట్ చేయించి ప్రారంభించారు. రూ. 2.50 లక్షలతో బొడ్డకాయల వారి కళ్లాలకు జోకల వారి కళ్లాల వద్ద గల బోరు నుంచి పైపులైన్ ద్వారా అందించిన తాగునీటి సరఫరాను, నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించి మహిళలతో కుళాయిలు ప్రారంభించారు.

కోనాం హైలెవెల్ కాలువపై కల్వర్టు...

మంచాలకు చెందిన బోలెం వారి కళ్లాలకు వెళ్లే మార్గంలో కోనాం హైలెవెల్ కాలువపై విశాఖ డెయిరీ నిధులు రూ.4.80 లక్షలతో కల్వర్టు నిర్మించారు. దీంతో రైతుల రహదారి సమస్య తీరడంతో పాటు మంచాల, శిరిజాం,చీడికాడకు చెందిన సుమారు 500 ఎకరాల భూముల్లోని పంటలు తెచ్చుకునేందుకు దారి ఏర్పడింది.

బి.సింగవరంలో రూ.3.85 లక్షలతో గ్రామం నుంచి చిన్నారు బంద చెరువు మీదుగా కళ్లాలకు వెళ్లే దారిలో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. శిరాజాంలో రూ. 2.05 లక్షలతో గ్రామానికి చెందిన పోతల, బొడ్డు, కన్నూరి వారి కళ్లాలకు వెళ్లే దాలెమ్మ చెరువు అలువు వద్ద నిర్మించిన కల్వర్టును కూడా డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

రూ.14 లక్షలతో శైలేజ్ ప్లాంటుకు ప్రారంభోత్సవం

పాడి పశువులకు పోషకవిలువలతో కూడిన ఆహారాన్ని తక్కువ ధరకు అందించేందుకు అప్పలరాజుపురంలో రూ.14 లక్షలతో నెలకొల్పిన మొక్కజొన్నతో శైలేజ్ గడ్డి తయారీ చేసే ప్లాంట్‌ను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. దీంతో వేసవిలో పాడిపశువులకు పశుగ్రాసం కొరత తీరనుంది. కార్యక్రమంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్, విశాఖ డెయిరీ డైరెక్టర్ పిళ్లా రమాకుమారి, ఎంపీపీ కురచా జయమ్మనారాయ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, వైస్ ఎంపీపీలు కిముడు చిన్నమ్మలు, ధర్మిశెట్టి స్వాతి, డెయిరీ డైరెక్టర్లు శీరంరెడ్డి సూర్యనారాయణ, గెదెల సత్యనారాయణ, సుందరపు గంగాధర్, దాడి పవన్‌కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, సర్పంచ్‌లు చుక్కా అప్పలనాయుడు, కోడూరి సత్యవతి, ఎస్.సన్యాసినాయుడు, మజ్జి లక్ష్మణమ్మ, కో–ఆప్షన్ మెంబర్ షేకు సూర్యనారాయణ, ఉపసర్పంచ్‌లు కసిరెడ్డి రామకృష్ణ, చైతన్య, పాలసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.


అప్పలరాజుపురంలో శైలేజ్ ప్లాంట్ మిషన్ స్విచాన్ చేస్తున్న డిప్యూటీ సీఎం


కుళాయిలను ప్రారంభిస్తున్న దృశ్యం

ఉన్నత విద్యకు గురుకుల మార్గం

- సీట్లకు పెరిగిన డిమాండ్
- ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థుల ఎంపిక


గురుకులంలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం: పేద విద్యార్థులకు గురుకుల పాఠశాల, కళాశాలలు ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయి. విలువలతో కూడిన విద్యా బోధన, క్రమశిక్షణ అందిస్తున్నాయి. వీటిలో చదివిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఈ ఏడాది గురుకులంలో సీట్ల భర్తీకి ఇటీవల ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లాలోని బాల, బాలికల గురుకుల పాఠశాలల్లో చేరేందుకు ప్రభుత్వం అవకాశాలు కల్పించింది. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి సీట్ల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రవేశ పరీక్షల్లో రాణించిన వారిని ఎంపిక చేసి ప్రాధాన్యమిస్తారు. జిల్లాలో తానాం, పాయకరావుపేట, చోడవరం (బాలికలు), నర్సీపట్నం, అనకాపల్లి (బాలుర) గురుకులాలు ఉన్నాయి. వీటిలో ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయిస్తారు.

అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. ఐదో తరగతి ప్రవేశానికి 9 నుంచి 11 ఏళ్ల మధ్య వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వయసు 9 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వం లేదా, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో తప్పనిసరిగా 3, 4 తరగతులు చదివి ఉండాలి. తానాంలో 80 సీట్లు, పాయకరావుపేటలో 40, చోడవరంలో 40, నర్సీపట్నంలో 80, అనకాపల్లిలో 80 సీట్లు అందుబాటులో ఉన్నాయి. తానాం పాఠశాలతోపాటు జూనియర్ కళాశాల ఉంది. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉన్నాయి. ఇంటర్ తర్వాత జేఈఈ మెయిన్స్, నీట్‌లలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా తర్ఫీదు ఇస్తున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో విద్యా బోధన అందిస్తున్నారు. అనేక సదుపాయాలు గురుకుల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తోంది.

మరిన్ని వివరాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఆఖరు తేదీ: ఈ నెల 31
- ప్రవేశ పరీక్ష తేదీ: ఏప్రిల్ 27న 5వ తరగతి, ఏప్రిల్ 13న ఇంటర్మీడియట్

సీట్లకు డిమాండ్ పెరిగింది



ఎంజేపీ గురుకులంలో సీట్ల డిమాండ్ పెరిగింది. ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తాం. నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ ఉంటోంది. వారి అభ్యున్నతికి ఇక్కడే బాటలు వేస్తాం. క్వాలిటీ ఎడ్యుకేషన్ అందిస్తుండడంతో సీట్లకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– ఎస్.వెంకటరెడ్డి, జిల్లా కన్వీనర్, నర్సీపట్నం ప్రిన్సిపాల్

ఆటో, బైక్ ఢీకొని యువకుడి మృతి

ప్రమాదంలో దగ్ధమైన బైక్


రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్) మృతి చెందిన నారాయణరావు(ఫైల్)


ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన బైక్

మాకవరపాలెం: ఆటో, బైక్ ఢీ కొట్టుకున్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి పయనిస్తున్న బైక్ పూర్తిగా దగ్ధమైంది. వివరాలిలాఉన్నాయి. మండలంలోని గిడుతూరు గ్రామానికి చెందిన లంక నారాయణరావు(34) పెదబొడ్డేపల్లిలో మరొక వ్యక్తితో కలిసి జేసీబీల విడిభాగాలు అమ్మే షాపు నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి బైక్‌పై స్వగ్రామం బయలుదేరాడు. శ్రీరాంపురం గ్రామ సమీపానికి వచ్చేసరికి ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. దీంతో నారాయణరావుకు తల, ముఖంపై తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదంలో బైక్ పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామకృష్ణారావు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య పద్మ, తన్విత్(3), మూడు నెలల పాప ఉన్నారు. నారాయణరావు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య, పిల్లలకు దిక్కెవరంటూ స్థానికులు సైతం కంటతడి పెట్టారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం జగన్ అవిరళ కృషి

- విశాఖ డెయిరీ డైరెక్టర్ రమాకుమారి
- మంత్రి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరితో కలిసి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న హిమగౌరి, రమా కుమారి

కశింకోట : రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అవిరళ కృషి చేస్తున్నారని యలమంచిలి మున్సిపల్ చైర్ పర్సన్, విశాఖ డెయిరీ డైరెక్టర్ పిళ్లా రమాకుమారి అన్నారు. కన్నూరుపాలెంలో రూ.కోటితో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి ప్రారంభించారు. రూ.60 లక్షలతో నిర్మించిన తులసీ కల్యాణ మండపాన్ని ఆమెతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి అభివృద్ధి చేయలేదని ప్రతి పక్షాలు చేస్తున్న విమర్శలలో వాస్తవం లేదన్నారు. గ్రామాల్లో సచివాలయ భవనాలు, నాడు–నేడులో స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడం, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, వెల్‌నెస్ సెంటర్ల భవనాల నిర్మాణం చేశారన్నారు. వీటికి దాదాపు రూ.3 కోట్ల వరకు వ్యయం అవుతుందన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధికి, సంక్షేమానికి పాటుపడుతున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలు దోహదపడాలన్నారు. కాగా కల్యాణ మండపం ప్రారంభం సందర్భంగా అన్న సమారాధన నిర్వహించారు. ముందుగా రూ.25 లక్షలతో కన్నూరుపాలెంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, ఎస్టీ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, కాలువను హిమగౌరి ప్రారంభించారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీధర్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ రమణారావు, ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ గున్నయ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు అచ్చియ్యమ్మ, సర్పంచ్ ఎస్.శివ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా...

- 40 ఏళ్లలో నువ్వు చేయలేని అభివృద్ధి ఐదేళ్లలో చేసి చూపించా
- అయ్యన్నపాత్రుడుకు సవాల్ విసిరిన ఎమ్మెల్యే గణేష్


ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: 'అభివృద్ధిపై నేను చర్చకు సిద్ధం ...నువ్వు సిద్ధమేనా' అంటూ మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సవాల్ విసిరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ ఎస్సీ కాలనీలో ఈ నెల 2న జరిగిన కార్యక్రమంలో కల్లు తాగిన కోతి చందంగా మద్యం మత్తులో అయ్యన్నపాత్రుడు చాలా విమర్శలు చేశారన్నారు. సీఎంపై ఇష్టానుసారంగా విమర్శలు చేయకూడదన్న కనీస జ్ఞానం అయ్యన్నపాత్రుడుకు లేదన్నారు. మా నాయకుడు, మాపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. 40 ఏళ్లు ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన పనికిమాలిన సన్నాసి అయ్యన్నపాత్రుడు అని మండిపడ్డారు. ఆయనకు చేతకాని అభివృద్ధిని తాను ఐదేళ్లలో చేశానన్నారు. గ్రామాల్లో తమ ప్రభుత్వం నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, పాఠశాలలు అభివృద్ధికి నిదర్శనమన్నారు. అయ్యన్నపాత్రుడు గ్రామాల్లోకి వెళ్లి కళ్లు పెట్టి చూస్తే అభివృద్ధి కనిపిస్తుందన్నారు. ఇవన్నీ మీ తాత కట్టాడనుకుంటున్నావా..? అంటూ ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'గొలుగొండ మండలం, ఆరిలోవ రిజర్వు ఫారెస్ట్‌లో రోడ్డు విస్తరణకు అనుమతులు తేలేకపోయావు... నేను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచి రోడ్డు విస్తరణకు పర్మిషన్ తెచ్చాను..నువ్వు తెచ్చావా..నీ బాబు తెచ్చాడా..నీతాత తెచ్చాడా...?' అని మండిపడ్డారు. అయ్యన్నపాత్రుడు జీవితాంతం 150 పడకల ఆస్పత్రి గురించి చెబుతాడు..అంతకుమించి ఆయన చెప్పుకోవడానికి ఏమీలేదని ఎద్దేవా చేశారు. తాను 630 పడకలు కలిగిన మెడికల్ కళాశాల నిర్మాణం చేస్తున్నానన్నారు. రోడ్లు, కల్యాణ మండపాలకు శిలాఫలకాలు వేసి అయ్యన్నపాత్రుడు డబ్బులు దోచుకున్నాడని ఆరోపించారు. తాను రూ.6 కోట్లతో కొత్తవీధి రోడ్డు 70 శాతం రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశానన్నారు. మెయిన్‌రోడ్డును బూచిగా చూపి అయ్యన్నపాత్రుడులా పూటకో ప్రకటన చేసి వ్యాపారుల నుంచి డబ్బులు దండుకోలేదన్నారు. తాను ప్రకటనల మనిషిని కానని, నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ చేసి చూపిస్తానని సవాల్ విసిరారు. మరో రెండు నెలల్లో అయ్యన్నపాత్రుడు స్వగ్రామం అల్లిపూడికి మూటముల్లె సర్దుకుని వెళ్లడం ఖాయమన్నారు. అయ్యన్నపాత్రుడుని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


విప్ ధర్మశ్రీ సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

రావికమతం: తట్టబంద గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 30 కుటుంబాల నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో ఆదివారం వైఎస్ఆర్‌సీపీలో చేరారు. చేరిన వారిలో ఆ గ్రామానికి చెందిన పిళ్లా అప్పారావు, నాయుడు, రామకృష్ణ, సింబోతు సత్తిబాబు, బర్నికాల కొండబాబు, జోగా గంగరాజు, ఎస్.లోవరాజు, పి.చిరంజీవి, వార్డు మెంబర్ కె.నాగరాజు, కె.అప్పలరాజు వారి కుటుంబ సభ్యులు చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ధర్మశ్రీ పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు. చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ , ఆ గ్రామ మాజీ సర్పంచ్ రాజాన నర్సింహులు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.

గురుకులాల సెక్యూరిటీ సిబ్బందికి ఆరు నెలల జీతాలు జమ

దేవరాపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ జీతాలను జమ చేయడం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల జీతాలను ప్రభుత్వం శనివారం సాయంత్రం జమ చేసిందని తెనుగుపూడి గురుకుల విద్యాలయ సెక్యూరిటీ సిబ్బంది వరదపురెడ్డి తాతంనాయుడు, రొప్పల కొండబాబు, సోమిరెడ్డి పోతురాజు తెలిపారు. గత ఏడాది జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల జీతాలను తమ ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వీరంతా కృతజ్ఞతలు తెలియజేశారు. తమ జీతాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఉమ్మడి విశాఖ గురుకులాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతికి స్థానిక సెక్యూరిటీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పరిధిలో 11 గురుకుల విద్యాలయాల్లోని విధులు నిర్వర్తిస్తున్న 66 మంది సెక్యూరిటీ సిబ్బందికి పెండింగ్ జీతాలు విడుదల చేయడం పట్ల ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ పిళ్లా చంద్రం, జిల్లాలోని సెక్యూరిటీ సిబ్బంది స్వప్న, అరుణ, యమున తదితర్లు హర్షం వ్యక్తం చేశారు.

రూ.1.06 లక్షల విలువైన టేకు కలప పట్టివేత


పట్టుబడిన టేకు కలప

నాతవరం: అనుమతులు లేకుండా గుట్టుచప్పుడుగా రవాణా చేస్తున్న టేకు కలపను పట్టుకుని కేసు నమోదు చేశామని నాతవరం అటవీ సెక్షన్ అధికారి మహేష్‌గిరి అన్నారు. చమ్మచింత సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా టేకు చెట్లను నరికి తరలిస్తున్నట్టుగా మాకు సమాచారం వచ్చిందన్నారు. శనివారం రాత్రి సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించి రెండు బొలేరో వాహనాలపై తరలిస్తున్న టేకు కలపను పట్టుకున్నామన్నారు. కలపతో పాటు స్వాధీనం చేసుకున్న రెండు వాహనాలను నర్సీపట్నం అటవీ శాఖ కార్యాలయానికి తరలించామన్నారు. పట్టుబడిన కలప 2.4 సియంటీ కాగా దీని విలువ రూ.లక్షా 6వేలు ఉంటుందని నిర్ధారించామన్నారు. కలప రవాణా చేస్తున్న పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామానికి చెందిన గిరికిన నాగ శివపై ఆదివారం సాయంత్రం కేసు నమోదు చేశామని సెక్షన్ అధికారి తెలిపారు. ఈ దాడిలో సెక్షన్ అధికారితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో కేంద్ర బలగాల కవాతు


పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు

అనకాపల్లి : సార్వత్రిక ఎన్నికలకు బందోబస్తు విధులు నేపథ్యంలో జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఆదివారం కేంద్ర పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర పోలీసు బలగాలు, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ వసంత్‌కుమార్, అసిస్టెంట్ కమాండెంట్ అమిత్‌కుమార్ బృందాలు ఉదయం 9.30 గంటల నుండి 11.30 గంటల వరకు తుమ్మపాల,కొత్తపేటవీధి, గవరపేటవీధి, శివాలయంవీధి, ఇందిరానగర్, చినబాబుకాలనీ వరకు, సాయంత్రం 4 గంటల నుండి 5.30 గంటల వరకు విజయరామరాజుపేట, గాంధీనగర్, శ్రీరాంనగర్ కాలనీ, లక్ష్మీదేవిపేట, గూడ్స్‌రోడ్డు, వేల్పులవీధి వరకు కవాతు చేశాయి. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శంకరరావు, ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ హోమం

వినాయకుని సన్నిధిలో టెన్త్ విద్యార్థుల పూజలు


వినాయకుని సన్నిధిలో పూజలు

రాంబిల్లి: పంచదార్లలో ద్విముఖ కల్యాణ వినాయకుని సన్నిధిలో ఆదివారం పదో తరగతి విద్యార్థులతో అర్చకులు విజయ హోమం నిర్వహించారు. పలు మండలాల నుంచి పదో తరగతి విద్యార్థులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో వినాయకునికి పూజలు చేశారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పది పరీక్షల్లో ఉత్తీర్ణత కావడంతో పాటు మంచి మార్కులు సాధించాలని విద్యార్థులు వినాయకునికి పూజలు చేశారు. పూజల అనంతరం విద్యార్థులకు తీర్థ ప్రసాదాలతోపాటు పరీక్షలు రాసేందుకు అవసరమైన సామగ్రిని అందజేశారు.


హాజరైన విద్యార్థులు

క్లుప్తంగా

ఓటర్లూ.. ప్రలోభాలకు తలొగ్గొద్దు



సదస్సులో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి: ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. ఓటు హక్కు వినియోగం పై నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజాప్రతినిధులను ప్రశ్నించే అధికారం ఓటు హక్కు వినియోగం తో దక్కుతుందన్నారు. ప్రలోభాలకు తలొగ్గ కుండా మేలు చేసే నేతలకు పట్టం కట్టాలన్నారు. ఈకార్యక్రమంలో ఇంగ్లిష్ శిక్షకురాలు బి.నేహ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట

అనకాపల్లి: స్థానిక లక్ష్మీదేవిపేట దుర్గానగర్‌లోని గణపతిదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టాపన మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీగణపతిహోమం, ప్రత్యేక కంకుమార్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు జగదీష్, కృష్ణ, గోపీ, శ్రీను, ముకుంద, కొణతాల శ్రీను, దాడి బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల నిమజ్జనోత్సవం



ఊరేగింపులో గౌరమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల(గౌరమ్మ) నిమజ్జనోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు పార్కు వద్దగల ఆలయం నుంచి అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై వెలంపేట, గవరపేటల మీదుగా పెదగుమ్మం వరకు గౌరీపరమేశ్వరులను ఊరేగించారు. ఈ సందర్భంగా దారి పొడవునా ప్రజలు దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం శారదానదిలో నిమజ్జనం చేశారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అనకాపల్లి సినిమాలు

ఈగల్	:	రాజా
ఆపరేషన్‌వాలంటైన్	:	సత్యనారాయణస్క్రీన్-1
భ్రమయుగం	:	సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరాయ్	:	షిర్డీసాయి
ఊరు పేరు భైరవకోన	:	పర్తిసాయి
నాగదీపం	:	వేంకటేశ్వర
ఇంటి నెం.13	:	శ్రీసత్య
చారీ 111	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 41 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-10 యూనిట్లు, బి పాజిటివ్-26 యూనిట్లు, ఒ పాజిటివ్-3 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 329 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 504 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

నిండు జీవితానికి రెండు చుక్కలు



కోట్నివీధి రామాలయం వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ లూసి



కన్నూరుపాలెంలో పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి



రామాలయం వద్ద పోలియోచుక్కలు వేస్తున్న కార్పొరేటర్ సునీత



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న సూరిబాబు

అనకాపల్లి: ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజాన్ని స్థాపించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ అన్నారు. స్థానిక గొల్లవీధి యూపీహెచ్‌సీలో ఆదివారం ఆయన చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులు నిర్లక్ష్యాన్ని విడాలని కోరారు. పిల్లల నిండు జీవితానికి తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● స్థానిక కోట్నీవీధి రామాలయంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పల్స్ పోలియో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ లూసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో 84వ వార్డు ఇన్‌చార్జ్ కోరుకొండ రాఘవ, కోట్నివీధి పీహెచ్‌సీ వైద్యులు నాగేంద్ర కుమార్, సతీష్ కన్నా, కేతిరెడ్డి ప్రసాద్, ఏఎన్‌ఎం శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక వేల్పులవీధి రామాలయం వద్ద పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి ప్రారంభించి, చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగ అధ్యక్షుడు ఉగ్గిన అప్పారావు, పార్టీ నేతలు జెట్టి శ్రీను, గొర్లి చిన్న, గ్రబ్రెడ్డి నూకరాజు, అంగనవాడీ టీచర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక కాంప్లెక్స్ రహదారిలో రామాలయం వద్ద 82వవార్డు కార్పొరేటర్ మందపాటి సునీత చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

● స్థానిక లక్ష్మీదేవిపేట పాఠశాలతోపాటు అన్నపూర్ణబ్యాంకులో 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నాయకులు బుద్ద భాస్కర్, కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ డైరెక్టర్ కొమ్మన శంకర్, ఎస్సీసెల్ కార్యదర్శి రేబాక స్వామి, 5వ సచివాలయం కన్వీనర్ బుద్ద పెంటారావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గోపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎంపీపీ గొర్లి సూరిబాబు పోలియోచుక్కలు వేశారు.

కశింకోట: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. కశింకోట, తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కన్నూరుపాలెంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరి పోలియో చుక్కలు వేశారు. కశింకోట,ఉగ్గినపాలెం పంచాయతీ కార్యాలయాల్లో ఎంపీపీ కలగా లక్ష్మి పోలియో చుక్కల వేయగా వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, మంత్రి జయ రజని పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.తిరుపతిరావు మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలోని 41కేంద్రాల్లో 93.96 శాతం మందికి పోలియో చుక్కల వేశామన్నారు. మొత్తం 6,250 మంది పిల్లలుండగా, వారిలో 5,873 మందికి వేశామని, మిగిలిన వారికి సోమ, మంగళ వారాల్లో ఇంటింటి సర్వే జరిపి వేస్తామన్నారు. ఇక్కడి శారదానది అవతల ఉన్న 5 ఇటుకల బట్టీల్లో ఒడిశా కూలీల పిల్లలకు సంచార విభాగం ద్వారా పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. బయ్యవరంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు పోలియో చుక్కలు వేశారు. తాళ్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని 35 కేంద్రాల్లో 4,108 మందికి పోలియో చుక్కల వేశారు. తాళ్లపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని పోలియో చుక్కలు వేశారు. జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ, పీహెచ్‌సీ వైద్యులు యు.రమేష్, యశోద, మనీషా పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



వేల్పులవీధి రామాలయం వద్ద చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న డాక్టర్ రామ్మూర్తి



అన్నపూర్ణ బ్యాంకు వద్ద పోలియోచుక్కలు వేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి



కశింకోటలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి



కశింకోటలో పోలియో చుక్కలు వేస్తున్న వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి



తాళ్లపాలెంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి గణేష్

7,8 తేదీల్లో ఉత్తరాంధ్రస్థాయి వాలీబాల్ పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

అనకాపల్లి: పట్టణంలోని గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో ఈనెల 7, 8 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వాన వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు సీతారామ దేవస్థానం చైర్మన్ దాడి భాస్కరరావు తెలిపారు. సీతారామాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలు 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతాయని ఫ్లడ్ లైట్ల వెలుగులో రాత్రి 11 గంటల వరకు జరుగుతాయన్నారు. 9 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని, లీగ్ కం నాకౌట్ పద్ధతిలో జరుగుతాయని తెలిపారు. ఫైనల్స్‌ను 8వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.6వేలు, నాలుగో బహుమతిగా రూ.4వేలు, షీల్డ్‌లు అందజేయనున్నామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతోపాటు రవాణా చార్జీలు కూడా అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో నాగేంద్రస్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ రోషన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు పీలా రమణారావు, పొలిమేర శ్రీనివాసరావు, కాండ్రేగుల జయరాం, ఎల్లపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

మహా శివరాత్రినాడు ప్రత్యేక పూజలు

అనకాపల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకుని బట్లపూడి గ్రామంలోని సోహం ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకుడు రవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 8వ తేదీ తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు మహా మృత్యుంజయ హోమం, రాత్రి పది గంటలకు పంచామృతాభిషేకం, బిల్వార్చన, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీదేవిపేట రైల్వేగేటు వద్ద థాట్స్ ఆఫ్ ఆత్మజ్ఞాన యోగాశ్రమంలో శివరాత్రి రోజు శివలింగానికి పంచామృతాభిషేకం, మహారుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు రాజర్షి ఆత్మానందస్వామి తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచితంగా కోచింగ్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అనకాపల్లి: కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు శ్రీగౌరీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా కోచింగ్ ఇస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు ఆడారి నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని తుమ్మపాల హైస్కూల్లో ఆదివారం మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పరీక్ష నిర్వహించినట్టు ఆయన చెప్పారు. ఈ పరీక్షకు తుమ్మపాల, మార్టూరు, మామిడిపాలెం, కొండుపాలెం, సీహెచ్.ఎన్.అగ్రహారం, కొప్పాక, కూండ్రం, తారకరామాకాలనీ, దిబ్బపాలెం, సీతానగరం తదితర గ్రామాల నుంచి 378 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గోవిందరావు, ఉపాధ్యక్షుడు రాపేటి సూర్యనారాయణ , ప్రధాన కార్యదర్శి కె.జోగ అప్పారావు పాల్గొన్నారు.

అలరించిన హాస్య వల్లరి

అనకాపల్లి: లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వైఎంవీఏ హాలులో ఆదివారం నిర్వహించిన హాస్యావల్లరి ప్రేక్షకులను అలరించింది. ఈ కార్యక్రమంలో భాగంగా విజయబాబు ఈలపాట, విశాఖపట్నం హాస్యప్రియ కామెడీ క్లబ్ కు చెందిన ఇమంది ఈశ్వరరావు, నాగరాజు అల్లాడ, పి.ప్రవీణ్ కుమార్, సీహెచ్. నాగార్జున, రమ, సుజాత, సీత, హిమ ప్రదర్శించిన హాస్యామృతం కామెడీ షో ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం ముఖ్యఅతిథి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్, ఆత్మీయ అతిథి కె.సన్యాసినాయుడులను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినకోట బుచ్చిరాజు, రాపేటి నారాయణరావు, దాడి సూరిబాబు బొడ్డేడ రాజేష్ , బుద్ద శ్రీనివాసరావు, . పేకేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఊరు మురిసింది...

● కన్నూరుపాలెంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
● ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



కన్నూరుపాలెం ఎస్టీ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



ఎస్టీ కాలనీలో నిర్మించిన డ్రైనేజీలు



ఎస్సీ కాలనీలో నిర్మించిన సిమెంట్ రోడ్డు



ఎస్సీ కాలనీలో నిర్మించిన కాలువ



చిన్న వీధిలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

కశింకోట: గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు.. అలాంటి పల్లెలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. సీఎం వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పల్లెల ప్రగతికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారు. మండలంలోని కన్నూరుపాలెం(ఈ.చౌడువాడ) సచివాలయం పరిధిలో గతంలో ఎన్నడూలేని విధంగా రూ.60 లక్షలకుపైగా వ్యయంతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. వీటిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ నివాస ప్రాంతాల్లో ఉండటం విశేషం. సందుల్లో సైతం సిమెంట్ రోడ్ల నిర్మిస్తున్నారు. మండల శివారులో నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డులో శివారున కన్నూరుపాలెం పంచాయతీతోపాటు సచివాలయం ఉన్నాయి. పాత కన్నూరుపాలెం శివారు గ్రామం. సుమారు రూ.3 వేల మంది జనాభా ఉన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు పర్యవేక్షణలో పంచాయతీ నిధుల నుంచి గ్రామంలో పలుచోట్ల సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఏర్పడిన ఎస్టీ కాలనీలో రోడ్డు అధ్వానంగా ఉండడంతో దాని స్థానంలో రూ.20 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డు నిర్మించారు. కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు డ్రైనేజీలు లేవు. వీటిని కూడా నిర్మించి ఆదివారం ప్రారంభోత్సవం చేశారు. దీంతో కాలనీ వాసులు మురిసిపోతున్నారు. ఎస్సీ కాలనీలో రూ.9 లక్షలతో ఏడాది క్రితం సిమెంట్ రోడ్లు, మురికి కాలువలు నిర్మించారు. బీసీలు, ఇతరులు నివసించే చిన్న వీధులు, సందుల్లో సైతం రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. మరో ఐదు లక్షలతో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. గ్రామ శివారులో ఉన్న మేడిశెట్టి వారి ఇళ్లకు రూ.12 లక్షలు, గెడ్డం వారి ఇళ్లకు కూడా రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్లు ఏడాది క్రితం నిర్మించారు. శివారు గ్రామం పాత కన్నూరుపాలెంలో మరిడిమాంబ ఆలయానికి రూ.3 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. ఇలా గతంలో ఎన్నడూ లేని విధంగా సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మాణం జరగడం వైఎస్సార్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని పేర్కొంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



కాలనీలో సరైన రోడ్లు, మురికి కాలువలు లేక దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నాం. తాజాగా సిమెంట్ రోడ్డు వేశారు. మురికి కాలువలు కూడా నిర్మించారు. పేదలు నివసించే ఎస్టీ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించినందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

– టి. నూకరత్నం, కన్నూరుపాలెం ఎస్టీ కాలనీ

ఇబ్బందులు తొలగాయి



ఎస్టీ కాలనీలో 14 ఏళ్లగా నివాసం ఉంటున్నాం. ఇప్పటి వరకు మురికి కాలువలు లేవు. మురికి నీరు, వాడుక నీరు పోయే అవకాశం లేక దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడే వారం.కొత్తగా కాలువల నిర్మించడంతో ఇబ్బంది తొలగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–ఎ.రాజేశ్వరి, ఎస్టీ కాలనీ, కన్నూరుపాలెం.

శరవేగంగా కలెక్టరేట్ రోడ్డు విస్తరణ పనులు



కలెక్టరేట్ రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న కార్మికులు

తుమ్మపాల: మండలంలోని శంకరంలో గల కలెక్టరేట్ రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జాతీయ రహదారి నుంచి కిలోమీటరు దూరంలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు ఉన్నాయి. ఈ రోడ్డులో నిత్యం వందల కొద్దీ వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం ఉన్న 20 అడుగులరోడ్డు ఇరుకుగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు రోడ్డును 30 అడుగుల మేర విస్తరిస్తున్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల నుంచి రూ.11 లక్షల వెచ్చించి పనులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా హైవే వద్ద నిర్మించిన కలెక్టరేట్ ఆర్చ్‌ను ఇప్పటికే మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బి.వి.సత్యవతి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ప్రారంభించారు. మరో నెల రోజుల్లో విస్తరణ పనులు కూడా పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా 5 అడుగుల వరకు స్థలాలను సేకరించి విస్తరణకు కేటాయించారు. భూ యాజమానులకు ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలాలు కేటాయించారు.

ఇంటర్ విద్యార్థులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా చర్యలు

అనకాపల్లి : ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటూ, ఆదరా బాదరాగా అతికష్టం మీద పరీక్ష కేంద్రాలకు చేరుకుంటున్న వైనాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ దృష్టి కొస్తున్నట్టు కమిషన్ సభ్యులు గొండు సీతారాం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క విద్యార్థి ట్రాఫిక్ సిగ్నల్స్ వల్ల, అధిక ట్రాఫిక్ ఇబ్బందుల కారణంగా పరీక్షలకు ఆలస్యం కాకుండా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేలా చర్యలు చేపట్టాలని అన్ని జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లకు కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్టు సీతారాం తెలిపారు. ఈ విషయంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

రాంబిల్లి: దిమిలిలో మురుగుకాలువ నిర్మాణ పనులను ఆదివా రం సర్పంచ్ బంగారు చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ ప్రారంభించారు. రూ 5లక్షలతో వీటిని నిర్మిస్తున్నారు.

వైభవంగా కోదండ సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

మునగపాక : గవర్ల అనకాపల్లిలో ఆదివారం కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతర భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ కాండ్రేగుల సూర్యనారాయణ భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

1150 లీటర్ల పులుపు ధ్వంసం

పాయకరావుపేట : ఈదటం గ్రామ శివారు ప్రాంతంలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి 500 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ బి.జోగారావు తెలిపారు. పట్టణ సమీపాన గల సుద్దకొండపై దాడులు నిర్వహించి 650 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు.